క్లుప్తంగా

అక్రమ అడ్మిషన్లు, ఫీజుల దోపిడీ అరికట్టండి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంతి నిలయం: జిల్లాలోని పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, కదిరి, మడకశిరలో ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ అడ్మిషన్లు, ఫీజుల దోపిడీలను అరికట్టాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జీఓ 8 ప్రకారం జిల్లాలోని ఒక్క ప్రైవేట్ పాఠశాలలో కూడా వసతులు సక్రమంగా లేవన్నారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

తాడిమర్రి: చిల్లవారిపల్లిలో పొలం గట్టు విషయమై ఇద్దరు రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగిరెడ్డిగారి చంద్రిక, ఆమె భర్త శివుడు, మరోరైతు పిట్టు ఆవులయ్యల మధ్య కొంత కాలంగా పొలం గట్టు వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లిన రైతులు గట్టును మావైపు జరిపారంటే మా వైపు జరిపారంటూ గొడవ పడ్డారు. ఇరు వర్గాల వారు పరస్పర రాళ్లదాడి చేసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన ఆవులయ్య ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు అక్కడే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే చంద్రిక భర్త శివుడు కూడా తాడిమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపారు.

రూ.15 వేల పింఛన్ ఇప్పించండి



సాయి నిఖిల్‌తో తల్లిదండ్రులు

ప్రశాంతి నిలయం: తమ కుమారుడు సాయి నిఖిల్ చిన్న వయస్సులోనే బుద్ధిమాంద్యంతో పాటు వైకల్యం కారణంగా శరీరం మొత్తం కదలలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నాడని, అతడికి ప్రస్తుతం వస్తున్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.15వేల పింఛన్ మంజూరు చేయాలని ఓడీచెరువుకు చెందిన రాజశేఖర్, అంజలీదేవి దంపతులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న డీసీహెచ్‌ఎస్‌ను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

తలుపుల : రాజనాలవాండ్లపల్లిలో సోమవారం శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, ఆర్.శశిధర్‌రెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో దేవుని కడప వేదపండితులు నరసింహశాస్త్రి బృందం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

మార్కెట్ ధరల ప్రకారమే పరిహారం చెల్లించండి

ముదిగుబ్బ: ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే ఎన్‌హెచ్ 342 రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న తమకు మార్కెట్ ధరల ప్రకారమే పరిహారం చెల్లించాని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం రైతులు రమేష్ బాబు, ప్రకాష్, ప్రభాకర్, హనుమంతు తదితర రైతులు తహసీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పరిహారం పెంపు తమ పరిధిలో లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

ఇంకెన్నాళ్లు మోసం..?

ముదిగుబ్బ: హామీలు ఇవ్వడం.. అమలు చేయకుండా మోసం చేయడం.. ఇలా ఇంకెన్నాళ్లు చేస్తారని సీపీఐ నాయకులు పాలకులపై ధ్వజమెత్తారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ నారాయణ స్వామికి వినతిపత్రం అందజేశారు.

పనులు అడ్డదిడ్డం.. ప్రజలకు నరకం

వర్షాకాలం వస్తోంది. కాలువల్లో పూడిక తీత చేపట్టి డ్రెయిన్లను శుభ్రం చేస్తామని, స్వచ్ఛ ధర్మవరం చూపిస్తామని పాలకులు చెప్పిన మాటలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. కూటమి పార్టీలలో నాయకుల అండదండలు కాంట్రాక్టర్‌కు ఉండటంతో ఇష్టారాజ్యంగా డిసిల్టేషన్ (కాలువలలో పూడికతీత) పనులు చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

- డ్రెయిన్లలో ఇష్టారాజ్యంగా డిస్టిలేషన్ పనులు
- షాపులు, ఇళ్లముందు ర్యాంప్‌ల ధ్వంసంతో అవస్థలు
- అధికారుల ప్రేక్షకపాత్రపై మండిపడుతున్న ప్రజలు



యంత్రాలతో చేపట్టడంతో కాలువ దెబ్బతిని రాళ్లు తేలిన దృశ్యం



ర్యాంపులు తొలగించడంతో తాత్కాలిక ఐరన్ స్లాబ్‌పై మూటలు మోస్తున్న వ్యక్తి

ధర్మవరం : మున్సిపాలిటీలో ప్రధాన వీధులతో పాటు ఇతర ప్రాంతాల్లో డ్రెయినేజీల్లోని పూడిక తొలగింపు పనులకు రూ.70 లక్షల నిధులతో టెండర్లు పిలిచారు. ఇందేలె రూ.37 లక్షలతో తొలి విడత పనులను కూటమి నాయకులు దక్కించుకున్నారు. అయితే టెండర్‌లలో స్పష్టంగా పెద్ద కాలువలలో యంత్రాలను ఉపయోగించి, చిన్న కాలువలలో గ్యాంగ్ వర్క్‌లు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్‌లు ఆచరణలో నిబంధనలు తుంగలోకి తొక్కేశారు.

ఖర్చు తగ్గించుకునేందుకే జేసీబీలతో పనులు

ధర్మవరం పట్టణ ప్రధాన రహదారులతో పాటు వివిధ కాలనీల్లో ఉన్న డ్రెయినేజీలు 2, 3 అడుగుల వెడల్పుతో ఉన్నాయి. వీటిని గ్యాంగ్ వర్క్‌తో మాత్రమే పనులు చేపట్టి పూడికతీయడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. అయితే ఇది ఖర్చుతో కూడుకుని ఉండటంతో సదరు కూటమి నాయకులు జేసీబీలతో పనులు చేయించారు. ఇష్టారాజ్యంగా పూడిక తీత పనులు చేపట్టడంతో కాలువలు దెబ్బతిని రాళ్లు పైకి తేలాయి. దుకాణాలు, ఇళ్ల ముందు ఉన్న ర్యాంపులను జేసీబీలతో ఇష్టానుసారం తీయడం వలన చాలా చోట్ల నివాసాలు దెబ్బతిని మురుగునీరు ఇళ్లలోకి చేరింది. 20 రోజులైనా అరకొరగానే పూడిక తీయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇంట్లోకి వెళ్లాలంటే సర్కస్ ఫీట్‌లు చేసేలా పరిస్థితి ఉత్పన్నమవుతోంది. మరోవైపు దెబ్బతిన్న ర్యాంప్‌లను మళ్లీ కట్టుకునేందుకు గృహ, షాపు యజమానులకు రూ.30 వేల నుంచి రూ.40వేల దాకా ఖర్చు అవుతోంది.

మున్సిపాలిటీకి భారీ నష్టం

జేసీబీ యంత్రాలతో కాలువల పూడికతీత వల్ల దెబ్బతిన్న కాలువలను మరమ్మతులు చేపట్టేందుకు యంత్రాలను ఉపయోగించడం ద్వారా డ్రెయిన్‌లు దెబ్బతిని మున్సిపాలిటీకి భారీ నష్టం ఏర్పడింది. ఎందుకంటే వర్షాకాలంలో పూర్తిగా తడసి ముద్దయిన డ్రెయిన్లలో యంత్రాలతో పనులు చేపట్టడం వల్ల చాలా ప్రాంతాలలో దెబ్బతిన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు బిల్లులు పెట్టేందుకు కొలతల ప్రక్రియ పూర్తి చేసినట్లు సమాచారం.


ఇబ్బందులు పడుతున్నాం



కాలువలలో పూడిక తీత పనులు ఆలస్యం అవడంతో షాపులోకి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నాం. వ్యాపారం చేసే సమయంలో కాలువ దాటుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడి దుకాణం వద్దకు రావడం లేదు. అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలి.

–మాబు, ఫర్నీచర్ వ్యాపారి, ధర్మవరం

దుర్వాసన భరించలేకున్నాం



షాపుల ముందు కాలువ పూడికతీత పనులు చేపట్టి మూడు వారాలైంది. పూడిక తీసినప్పటికీ ఆ ప్రాంతమంతా దుర్వాసన గుప్పుమంటోంది. ముసలి వారు, చిన్నపిల్లలు కాలువ దాటుకునేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. – మస్తాన్, ధర్మవరం

పనుల పూర్తికి చర్యలు

డిసిల్టేషన్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం. పట్టణంలో మొత్తం 120 కిలోమీటర్ల దాకా డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడుతున్నాం. వీటిలో సగం 60 కిలోమీటర్లు యంత్రాలతో, మరో 60 కిలోమీటర్లు గ్యాంగ్‌వర్క్‌లు జరిగేలా కాంట్రాక్టర్‌లకు ఆదేశాలిచ్చాం. పనులు నిబంధనల మేరకే జరుగుతున్నాయి.

–సాయికృష్ణ, మున్సిపల్ డీఈ, ధర్మవరం

హామీల అమలులో విఫలం

కనగానపల్లి: ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బెల్లం మహదేవ విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ, రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల నాయకులు బడ మాదన్న, అంకె ఆదినారాయణ, నాగరాజు, ముత్యాలు, సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, నాయకులు రాజన్న, రవి, వడ్ల గోవిందు, మల్లికార్జున, పలువురు రైతులు పాల్గొన్నారు.

పోస్టల్ పేమెంట్స్ సేవలు సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి టౌన్: తపాలా శాఖ ప్రవేశపెట్టిన ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సేవలు సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ ప్రాంతీయ బ్యాంక్‌లతో సమానంగా ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్‌లలో అర్హులైన వారికి ఆర్థిక సాధికారిత, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందే అవకాశాలు ఉన్నాయన్నారు.

నీటిఎద్దడిపై నిరసన

గాండ్లపెంట: కల్లుబావి తండాలో నెలకొన్న నీటిఎద్దడిపై తండావాసులు సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పంచాయతీ బోరుకు రైతులు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్‌తో గ్రామానికి నీరు సరఫరా అయ్యేవన్నారు. అయితే రైతులు తమ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లిపోవడంతో రెండు నెలలుగా తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ బాబూరావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు

బాబు వెన్నుపోటును ప్రజలకు వివరిద్దాం

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి



'వెన్నుపోటు' పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: ఇబ్బడి ముబ్బడి హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలకు పొడిచిన వెన్నుపోటు గురించి కళ్లకు కట్టినట్టు వివరిద్దామని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. ఈ నెల నాలుగో తేదీన చేపట్టే 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన సోమవారం కేతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ మోసానికి మారుపేరు చంద్రబాబు నాయుడన్నారు. ప్రతి ఎన్నికల్లో హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య అని అన్నారు. సూపర్ సిక్స్‌లోని తల్లికి వందనం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. సంపదను అమరావతికి మాత్రమే పరిమితం చేసి పేదలను మరింత పేదవాళ్లగా చేసేందుకు బాబు కంకణం కట్టుకున్నారన్నారు. బాబు ప్రజా వ్యతిరేఖ విధానాలకు నిరసనగా ఈ నెల 4న క్యాంప్ కార్యాలయం నుంచి 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రెండవ పట్టణాధ్యక్షుడు బాలిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు, కేతా లోకేష్, బ్రహ్మ, జిలాన్‌బాషా, గజ్జల శివ, వార్డు ఇన్‌చార్జ్‌లు గడ్డం కుళ్లాయప్ప, కత్తె పెద్దన్న, దేవరకొండ రమేష్, వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, అమర్‌నాథ్‌రెడ్డి, రెడ్డివారి రాజారెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు జింకా కంబగిరి, మైనార్టీ నాయకులు హిదయతుల్లా, సాధిక్, అనుబంధ విభాగాల నాయకులు ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, అశోక్, లోనికోట నారాయణస్వామి, మహేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. తనకల్లులో సోమవారం పార్టీ సీనియర్ నాయకులు దేశాయి సంజీవరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొనేందుకు అన్ని గ్రామాల నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు తనకల్లులోని చౌడేశ్వరి ఆలయం వద్దకు పార్టీ శ్రేణులు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ముస్తఫా, మోహన్, నాయకులు భక్తవత్సలరెడ్డి, బీఎస్ కలాం, మండల కమిటీ సభ్యులు రెడ్డిపీరా, సూరి, రాజారెడ్డి, రమణారెడ్డి, చంద్ర, లక్ష్మిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నర్సీరెడ్డి, బాబ్‌జాన్, ఇక్బాల్, అబ్దుల్, రమణ, డీలర్ నరసింహులు, ప్రకాష్, హరి, శంకర్, షామీర్ పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ నాయకుల డిమాండ్



కదిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కదిరి టౌన్/ ఓడీచెరువు/ తనకల్లు/ బత్తలపల్లి/ తలుపుల/ చెన్నేకొత్తపల్లి/ నల్లమాడ/ అమడగూరు : పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. తనకల్లు మండలం బొంతలపల్లి సర్వేనంబర్ -183ఏలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనల అనంతరం కదిరి, ఓడీచెరువు, తనకల్లు, బత్తలపల్లి, తలుపుల, చెన్నేకొత్తపల్లి తహసీల్దార్లు మురళీకృష్ణ, అనంతాచారి, శోభాసువర్ణమ్మ, స్వర్ణలత, రెడ్డిశేఖర్, సురేష్‌కుమార్, నల్లమాడ డిప్యూటీ తహసీల్దార్ మనోజ్‌కుమార్, అమడగూరు రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పేదలు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్

ఓడీచెరువు/ గాండ్లపెంట/ తనకల్లు/ నల్లచెరువు/ చెన్నేకొత్తపల్లి : విత్తన వేరుశనగ కావాలసిన రైతులు మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచించారు. ఈ మేరకు సబ్సిడీ విత్తన వేరుశనగ వివరాలను ఓడీచెరువు, గాండ్లపెంట, తనకల్లు, నల్లచెరువు, చెన్నేకొత్తపల్లి వ్యవసాయాధికారులు ఇలియాజ్ అహ్మద్, లక్ష్మీప్రియ, శ్రీహరినాయక్, భారతి, ఉదయ్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. అర ఎకరం వరకు ఒక బ్యాగు, అర ఎకరం నుంచి ఎకరం వరకు రెండు బ్యాగులు, ఎకరంపైన భూమి ఉన్న రైతులకు గరిష్టంగా 3 బ్యాగులు చొప్పున పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కె-6, టీసీజీఎస్-1694 రకం విత్తనాల 30 కేజీల బ్యాగు పూర్తి ధర రూ.2,790 కాగా 40 శాతం సబ్సిడీ పోను రూ.1,674 చొప్పున రైతు చెల్లించాలని తెలిపారు. కదిరి లేపాక్షి రకం అయితే రూ.1,476 చెల్లించాలన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

కదిరి టౌన్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ శర్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో తాగునీరు, గదుల్లో లైట్లు, ఫ్యాన్ల సౌకర్యం కల్పించాలని, ట్రంకు పెట్టెలు, పుస్తకాలు, దుస్తులు, దుప్పట్లు, దోమతెరలు సకాలంలో అందించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని, కాస్మొటిక్, మెస్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వార్డెన్లు, కుక్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు గణేష్, కిరణ్, మల్లికార్జున, సాయిప్రదీప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

ధర్మవరం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక అమలుపై ఎంపీడీఓ సాయి మనోహర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పరిశుభ్రత గురించి చర్చించారు. ప్రణాళికలో భాగంగా జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీయూపీఎస్, ఎంపీపీఎస్ వంటి వివిధ స్థాయిల పాఠశాలలకు ఒక్కో రోజు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం.. దైన్యం

- ఖాళీగా అర్బన్ హెల్త్‌సెంటర్లు
- అందుబాటులో లేని వైద్యులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ
- ఇబ్బందులు పడుతున్న రోగులు



మూర్తిపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కదిరి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు ఉన్నప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు మృగ్యమయ్యాయి. కదిరి పట్టణంలో 70 వేలకు పైబడి జనాభా ఉంది. నాలుగు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ఒక ఏరియా ఆస్పత్రి అందుబాటులో ఉంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు అందుబాటులోనే మెరుగైన వైద్య సేవలందించాలని అవసరమైన పరికరాలు, మౌలిక వసతులు కల్పించారు. ప్రజలకు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటూ 65 రకాల వైద్య పరీక్షలు చేసి వైద్య సేవలందించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఆస్పత్రులపై పర్యవేక్షణ కొరవడింది. వైద్య సేవలు అస్తవ్యస్తంగా మారాయి. కుటాగుళ్ల, రాజీవ్‌గాంధీనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు సమయ పాలన పాటించడం లేదు. ఎప్పుడో ఒకసారి అలా రావడం.. వెళ్లిపోవడంతో వైద్యం పూర్తిస్థాయిలో అందే పరిస్థితులు లేవు. ఇక నిజాంవలి కాలనీకి నెల కిందట వరకు డాక్టర్ పోస్టు ఖాళీనే. వారం కిందట డిప్యుటేషన్ ఒకరిని అక్కడకు నియమించారు. అయినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూర్తిపల్లిలో వైద్య సేవలు మృగ్యం

మూర్తిపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రెండు నెలల నుంచి డాక్టర్ లేరు. అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో నాలుగు వేల జనాభా ఉన్నారూ. అందరూ నిరుపేదలే. కూలీనాలి చేసుకుని జీవనం సాగించేవారే. రోజూ 70 మంది దాకా హెల్త్ సెంటర్‌కు వైద్యం కోసం వస్తుంటారు. అయితే అక్కడ డాక్టర్ సీటు ఎప్పుడూ ఖాళీగానే దర్శనమిస్తోంది. డాక్టర్ ఎప్పుడు వస్తారో చెప్పేవారు కూడా లేరు. దీంతో రోజూ రోగులు రావడం.. నిరాశతో ఇక్కడి నుంచి ఏరియా ఆస్పత్రికి వెళ్లడం పరిపాటిగా మారింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా వైద్యులను నియమించి సేవలను మెరుగుపరచాలని కోరుతున్నారు.

- ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. మూర్తిపల్లి పట్టణ ప్రాథమిక అరోగ్య కేంద్రం డాక్టర్ రాజీనామా చేయడంతో పోస్టు ఖాళీ ఏర్పడిందన్నారు. త్వరలో డాక్టర్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

ఇబ్బందులు పడుతున్నాం



మున్సిపల్ పరిధిలో మూర్తిపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ అందుబాటులో లేక చాల ఇబ్బందులు పడుతున్నాం. ఈ ఏరియాలో ఉన్నవారంతా రోజుకూలి చేసుకుని జీవనం సాగించేవారు. అనారోగ్యం, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇక్కడకు వస్తే వైద్యం చేసేవారు లేరు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్‌కు తెలిపినా ఎటువంటి స్పందనా లేదు.

– ఈశ్వర్, వీవర్స్‌కాలనీ, కదిరి

వైద్య సేవలందించండి



మూర్తిపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ లేకపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆస్పత్రి ఉండి కూడా వైద్యం అందించకపోతే ఎలా..? స్థానికంగా వైద్యం వదిలి.. ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి రావడం దురదృష్టకరం. డాక్టరును అందుబాటులో ఉంచి వైద్య సేవలు పునరుద్ధరిస్తే పేదలకు ఎంతో మేలు చేసినట్టవుతుంది.

– దేరంగుల అంజనేయులు, మూర్తిపల్లి